
కథ

# లాయర్ ఆనంద్

హార్ధిక



విశాఖపట్నంలోని కైలాసగిరి ఓ పచ్చని అందమైన ప్రదేశం. దానికి పడమరై బారులుతీరిన సింహాచలం కొండలు, ఓ రెండు కొండల్ని చీల్చుకుంటూ నల్లని కృష్ణమ్మలా ఎన్.హెచ్.-5 రహదారి, సముద్రం వైపు నుంచి కొండ ఎక్కడానికి మెట్లు, రోప్-వే, ఉత్తరం ప్రక్క పోలీస్ గ్రౌండ్స్ నుంచి కొండపైకి రోడ్డు, కొండపైన శివపార్వతులు, ఇంకా దేవుళ్ళ విగ్రహాలెన్నో ఉన్నాయి.

నిట్టనిలువుగా కేక్ కట్‌చేసినట్లు ఉండే ఆ కొండ చెరియ పైన కొంతభాగం చదునుచేసి 'స్యూసైడ్ పాయింట్' అని పేరు పెట్టారు కార్పొరేషన్ వాళ్ళు. అందుకే కాబోలు అక్కడ చాలా, చాలా గద్దలు కాపురం ఉంటున్నాయి. అందులో ఓ నాల్గు గద్దలు ఆ ఉదయం ఆకాశంలో తేలుకుంటూ లాసన్స్-బేలో ఉన్న ఓ అందమైన ఇంటిపైన చక్కర్లు కొడుతున్నాయి.

***

ఆ యిల్లు లాయర్ ఆనందరావుది, పెద్ద కాంపౌండ్ మధ్య ఇల్లు, చుట్టూతా రకరకాల ఫల వృక్షాలు. ఎక్కువభాగం అరటి చెట్లు పొదలు పొదలుగా పెరిగి ఉన్నాయి. కొన్ని పువ్వులు పూసి, మరి కొన్ని గెలలు దిగి... ఆ ఉదయం ఆ యిల్లు చాలా ప్రశాంతంగా ఉంది, అరవై ఐదేళ్ల ముసలమ్మ గొడ్డలి తీసుకుని ఇంట్లో నుంచి వడివడిగా అడుగులు వేసుకుంటూ వచ్చి భీముడులా ఉన్న పనివాడి చేతికిచ్చి ఏదో ఆవేశంగా చెప్తుంది. ఆవిడ ఆనంద్ తల్లి ప్రసన్న లక్ష్మి. ప్రచండలక్ష్మి అంటుంటారు ఎరిగిన వారందరూ. ఆనంద్ అప్పుడే మార్నింగ్ వాక్‌కి కైలాసగిరి ఎక్కి దిగివచ్చాడు. పేపర్ చూస్తూ బూట్లు విప్పుకుంటున్నాడు. వంటగదిలో సరస్వతి, ఆనంద్ భార్య, ఉల్లిపాయలు తరుగుతోంది. బంటిగాడు, ఆనంద్ ఒక్కగానొక్క కొడుకు చింటూతో (పామేరియన్ డాగ్) బాల్ ఆట ఆడుతున్నాడు. వాతావరణం ఉక్కగా, ఉద్రిక్తంగా ఉంది.

'నరకరా వాటిని' అంది ప్రచండలక్ష్మి.

"వేటిని అమ్మగారూ", భీముడి ప్రశ్న.

"అవేరా అరటి చెట్లన్నింటినీ, నరికి పారేయ్. ఒక్కటి కూడా మిగలకూడదు".

"పచ్చటి చెట్లమ్మా, వాటినెందుకు నరకమంటున్నావ్?" పేపర్లో నుంచి తలెత్తాడు ఆనంద్.

"సిద్ధాంతి చెప్పాడ్రా, ప్రొద్దున్నే వాటి మొహం చూడకూడదని."

"ఏం?"

"ఒకే ఒక్క గెల కాస్తుందిగా అందుకని. నీ మొహం, నీ భార్య మొహం కూడా చూడొద్దన్నాడు. వీటిని నరికించి నేనెటైనా పోతా... వృద్ధుల ఆశ్రమం మంచిది చూడు చేరిపోతాను."

"ఎవడమ్మా వాడు? మూఢ విశ్వాసాల్ని ప్రచారం చేస్తుంది? చూపించు. ఏదో ఒక కేసులో ఇరికించి బొక్కలో తోయిస్తాను" అన్నాడు ఆనంద్.

"ఇన్నీ చెప్తావుగానీ ఇంకో పిల్లనో, పిల్లాడినో కందామని ఉండదేరా నీకు? మితిమీరిన గారాబంతో బంటీగాడు పెంకెగా మొండిగా తయారవుతున్నాడు, ఇంకోడు ఉంటేనేగాని పంచుకోవడం తెలియదు... అసలు సంగతి బయట పెట్టింది ప్రసన్న లక్ష్మి. బంటీగాడు మొహం మాడ్చుకున్నాడు, నానమ్మ తనని ఇరికించినందుకు నిరసనగా. టైమ్ బాగోలేదంటూ పెరట్లోకి పరుగుతీసింది చింటూ, దాని వెనక పరిగెట్టాడు బంటీ.

'ఇదన్నమాట సంగతి' అనుకుంటూ 'నువ్వెళ్ళు' అన్నట్లు భీముడికి సైగచేశాడు ఆనంద్. వాడు గొడ్డలి చెట్లల్లో దాచేసి బయటకి దారితీశాడు. చెట్లు నరికితే బయటపడే పాముల్ని, పందికొక్కుల్ని వేటాడుకోవచ్చని చక్కర్లు కొడుతున్న గద్దలు కూడా ఉసూరంటూ, జాలారిపేటకేసి దిశ మార్చుకొని, ఎండు చేపల వాసన వెతుక్కుంటూ సాగాయి.

"అప్పటికే దేశ జనాభా ఎక్కువయిపోయిందమ్మా, ఇంకా భారం పెంచటం ఎందుకు?" పాయింట్ లాగబోయాడు ఆనంద్.

"ఓయబ్బో, జనం, భారం... ఎవరికిరా భారం? పోషించలేని పేదవాళ్ళు కంటున్నారే చేతికిందకి 'పని'కొస్తారని వాళ్ళకి, నీలా సంపాయించగల్గిన వాళ్ళకి కాదు. అందుకు దేశం చెడింది. నీలాంటి వాళ్ళు ఎక్కువమంది పిల్లల్ని కనాలి, బాధ్యతగా వాళ్ళని పెంచాలి. దేశభక్తి నూరి పొయ్యాలి. అప్పుడ్రా దేశం ఉన్నతి చెందేది". నీ లాజిక్ నా దగ్గరా? అన్నట్లు ప్రచండంగా చూసింది లక్ష్మి.

"నాకు నలభై ఏళ్ళు, తనకి ముప్పై ఆరు, ఇప్పుడు పిల్లలంటే ఎలాగే? దాని ఆరోగ్యం చెడదూ? పుట్టేవాడి ఆరోగ్యం ఎలా ఉంటుందో?"

"ఏలిననాటి శనిలా ఏడేళ్ళ నుంచీ పోరుతున్నా, నా మాట లెఖ్ఖచేస్తేగా... అయినా ఏం ఫర్వా లేదు, ఈ వయస్సులో పిల్లల్ని కంటే వాళ్ళకి బాగా తెలివితేటలు వస్తాయి. భయపడక."

"ఆరోగ్యం?"

"కుడుం ముద్దల్లా ఉన్నారు ఇద్దరూ, ఏం కాదు."

"అది కాదమ్మా"...

"పెళ్ళాంమీద అంత ప్రేమైతే ఒక పని చెయ్. నీ దగ్గరకి విడాకులని శాడిస్టు వెధవలెంతోమంది వస్తుంటారుగా. ఓ మంచి అమాయకపు పిల్లకి విడాకులిప్పించేసి నువ్వు పెళ్ళాడేయ్."

ఆ! నోరెళ్ళబెట్టాడు ఆనంద్. ఆసక్తిగా తల్లీకొడుకుల సంభాషణ వింటున్న సరస్వతి గతుక్కుమంది. పెరట్లోకి పరిగెట్టిన చింటూ కంటబడిన పిల్లి వెంట కసిగా పరిగెట్టింది. బంటీ హాల్లోకి వచ్చి టీవీలో టామ్ అండ్ జర్రీ కార్టూన్ చూడసాగాడు.

"ఏంటా ఆశ్చర్యం? డబ్బున్నవాడి బాధ్యతగల బహుసంతానం దేశానికి లాభం అయినట్టే, ప్రేమించగల్గిన వాడికి బహుభార్యలుంటే, 'ఆడవాళ్ళ కరువొచ్చి' శాడిస్టు వెధవల తిక్క కుదుర్తుంది. ఇదీ ఒక రకం దేశసేవే"

"ఈ లాజిక్ బాగున్నట్లుందే?" నసిగాడు ఆనంద్.

"కృష్ణ పరమాత్మకి ఎనమండుగురు భార్యలు, అంత ప్రేమా చూపించగల్గిన నీకు ఇద్దరుండొచ్చు, ఏం ఫరవాలేదు."

"అందులో ఈడ్చి తన్నేవాళ్ళు కూడా ఉన్నారు" కొంగు బిగించింది సరస్వతి, సత్యభామని గుర్తుకు తెస్తూ.

"ఇదీ నిజమేనే అమ్మా" అన్నాడు ఆనంద్ భయం భయంగా, బాత్‌రూమ్‌కి పరిగెడుతూ.

"చట్టవిరుద్ధమైన సలహాలు నేరం, ఘోరం.." అరచింది సరస్వతి.

"చట్టాలు మాకు చుట్టాలే, వాడి తాతల కాలం నుండీ లాయర్ల కుటుంబం మాది" గర్వంగా అంది ముసలమ్మగారు.

"నేనెక్కడికి పోతానే? ఇది నా యిల్లు. నువ్వే పో... నువ్వింకో పెళ్ళి చేసుకోరా ఆనంద్. డాబా గార్డెన్స్‌లో ఉన్న ఇల్లు వచ్చేదానికి రాసేస్తాను." "బాంబులు పేలతాయ్" హెచ్చరిక వంటింట్లో నుంచి.

"మావాళ్ళు కూడా తరతరాలుగా సైన్యంలో పనిచేస్తున్నారు. మా నాన్నా, తమ్ముడూ ఎయిర్‌ఫోర్స్‌లో పెద్ద ఆఫీసర్లు" బెదిరింపుగా అంది సరస్వతి.

"మా నాన్న క్రిమినల్ లాయర్. పెద్దపెద్ద రౌడీలనే దారికితెచ్చిన వాళ్లం, భయానికే భయం మేమంటే."

"మేం ఆర్మీ... ఒకే ఒక్క బాంబు, ఎక్కడ నుండి పడిందో తెలిసేలోపు గోతిలోకి పోతారా రౌడీలందరూ" చిటికలేసింది సరస్వతి.

"అయితే ఏంటంటావే?"

"రౌడీలతో మేం మాట్లాడం. ఆర్మీవాళ్ళకి రౌడీలు ఈకతో సమానమని అర్థం చేసుకొండి చాలు."

"ఆఁ! మమ్మల్నే రౌడీలంటావా?"

"కాకపోతే, నా కాపురానికే ఎసరు పెడ్తారా?"

"ఎంతసేపు నగలు, షికార్లు, సింగారింపులే కాని, ఇంకో పిల్లాడ్ని కందామని ఉండదే? పెళ్ళయి పదిహేనేళ్ళయినా ఇంకా ఐశ్వర్యారాయిలా ఉండాలంటే ఎలా?"

"ఐశ్వర్యలా ఉంటామో? త్రిషలా ఉంటామో మీ కనవసరం. మీక్కావాల్సిందేంటో చెప్పండి. అంతేకానీ మీ క్రిమినల్ బ్రెయిన్ నా దగ్గర విప్పకండి."

"ఏం చేస్తావే? పెద్దా చిన్నా లేకుండా మాట్లాడుతున్నావ్?"

"ఇంక మాటల్లేవ్"... ఓ మర చెంబు ఫిరంగి గుండులా దూసుకొచ్చింది వంటగది నుంచి. అప్పుడే బాత్‌రూమ్ నుంచి వచ్చిన ఆనంద్ దాన్ని ఒడుపుగా పట్టుకున్నాడు. 'సూపర్ క్యాచ్' చప్పట్లు కొట్టాడు బంటీ.

"ఎంత పొగర్రా దానికి?" పళ్ళు పటపట కొరికింది ముసలమ్మ.

"ఆ చెంబు చింతపండేసి శుభ్రంగా తోముకుని తీర్థయాత్రలకి పొమ్మనండామెని" .. కూరలు తరిగే కత్తి ఝుళిపిస్తూ అంది సరస్వతి.

"నేనెక్కడికి పోతానే? ఇది నా యిల్లు. నువ్వే పో... నువ్వింకో పెళ్ళి చేసుకోరా ఆనంద్. డాబా గార్డెన్స్‌లో ఉన్న ఇల్లు వచ్చేదానికి రాసేస్తాను."

"బాంబులు పేలతాయ్" హెచ్చరిక వంటింట్లో నుంచి.

"అమ్మా ఊరుకోవే."

"లేదురా. ఇవ్వాళ అటో ఇటో తేలిపోవాల్సిందే."

"అయితే నే కైలాసానికి పోతానే"

"అదెక్కడుందిరా వైజాగ్‌లో?"

'కైలాసగిరి ఎక్కి దూకితే తిన్నగా అక్కడికే."

"అవేం మాటల్రా నాన్నా, పొద్దున్నే? సర్లె మీ కాపురం మీ ఇష్టం. తగలడండి. కానీ దానికి బుద్ధి చెప్పు. పెద్దా చిన్నా చూసి మాట్లాడమని."

సర్లె అంటూ, ఏదో అనబోతున్న సరస్వతి దగ్గరికెళ్ళి కౌగిలించుకుని ఓ ఇంగ్లీష్ ముద్దిచ్చేశాడు




ఆనంద్. అప్పటికి యుద్ధం ఆగింది.

***

అత్తగారూ, ఆనంద్ మధ్యాహ్నం కునుకుతీసే టైంలో 'అంబాలాకాంట్'లో ఉన్న తన తండ్రికి, తమ్ముడికి ఫోన్‌చేసి గంటన్నర గుసగుసలాడింది సరస్వతి. వాళ్ళు ప్రేమవర్షం కురిపించడంతోపాటు కొన్ని విత్తనాలు కూడా నాటారు ఆమె మనస్సులో... ''బ్రహ్మకైనా పుడుతుంది రిమ్మ తెగులు'', ''నలభై దాటిన వాడిని నమ్మకూడదు అక్కాయ్'', ''కోటి మంది కోటబైటి శత్రువుల కంటే కోటలో ఉన్న శత్రువు ఒక్కడైనా యమాడేంజర్'', ''ఇంటికి పెద్దదిక్కుతో యుద్ధంకంటే, స్నేహం వంటికి మంచిది'' ... ఇటువంటివి. అవి వెంటనే చెట్లయి కాయలు కూడా కాసినయ్. ఇంకో గంటలో సరస్వతి నిర్ణయానికి వచ్చేసింది. ఐదు నిమిషాల్లో ఇంట్లో ఉన్న గర్భనిరోధక సాధనాలన్నీ నీళ్ళ బాయిలర్‌లో అగ్నికి ఆహుతైపోయాయి. వ్రేళ్ళమీద కణుపులు లెక్కేసుకుని పదకొండో రోజనుకుంటూ చేత్తో మెడమీద వేడిమి చూసుకుని, వడివడిగా క్యాలెండర్ వళ్ళో పెట్టుకుని చూస్తే దశమి, రాత్రికి ఏకాదశి ప్రారంభం... అప్పుడు గుర్తొచ్చిందామెకి – ప్రొద్దున్న అత్తగారు ఇదేవిధంగా వేళ్ళు లెక్కడుతూ క్యాలెండర్ చూసింత ర్వాతే యుద్ధం ప్రకటించడం. 'హమ్మ రౌడీ ముసలమ్మా' అనుకుంటూ 'శత్రువుని తక్కువ అంచనా వేయకూడదమ్మాయ్' అన్న తన తండ్రి మాటలు గుర్తుకు రాగా ఉలిక్కిపడింది. ఇంట్లో ఉన్న నల్గురు మనుషులకు మూడు దుప్పట్లు మాత్రమే ఉంచి, లుంగీ, టవల్స్‌తో సహా మిగిలిన దుప్పట్లన్నింటినీ తడిపి వాషింగ్ మెషిన్‌లో గిరాటేసింది. అత్తగారు గమనించేలా, రాత్రి చక్కగా సింగారించుకొని సంధి ప్రకటించింది. కొడుకుని వేరే గదిలో పడుకోబెట్టి, డబుల్‌కాట్ బెడ్ మీద ఉన్న ఒక్క దుప్పటి కప్పుకుని నిద్రలోకి జారుకుంది సరస్వతి. రాత్రి ఎప్పుడో ఇంటికి చేరిన ఆనంద్ విధిలేక ఆ దుప్పట్లో దూరాడు.... తొమ్మిది నెలల తరువాత చింతపండేసి తోమిన ఇత్తడి చెంబులా తళతళలాడుతూ, కిలకిలా నవ్వుతున్న 'బుడుగు'గాడ్ని ముసలమ్మ చేతిలో ఉంచి శాశ్వత శాంతి ఒప్పందం చేసుకుంది.

***

ప్రస్తుతం ఒక విడాకుల కేసు డీల్ చేస్తున్నాడు ఆనంద్. హేమచంద్ర, శ్రావణి ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. చిన్నచిన్న పంతాలు, పట్టుదలలు వచ్చి దాదాపుగా సంవత్సరం నుంచి విడివిడిగా ఉంటున్నారు. ఎవడో తలకి మాసిన ఫ్రెండ్ తప్పుతాగించి, పుచ్చు సలహా ఒకటిచ్చాడట. ''సంవత్సరం కలిసి ఉండకపోతే విడాకులు తీసేసుకోవచ్చని''. తాగిన మందు తెల్లారి దిగిపోయినా, పుచ్చులో పురుగు తల్లో దూరి కెలుకుతుంటే ఆనంద్ వెంటపట్టాడా కుర్రాడు విడాకులిప్పించమని.

మూడు నెలలనుండీ కుర్రాణ్ణి తిప్పుతున్నాడు. మార్నింగ్ వాక్‌కి వెంట తీసుకుపోయి మైళ్ళు మైళ్ళు నడిపించి లోకంలో ఎంత అందం ఉందో చూపిస్తూ, హాలిడేస్‌లో అరకు, భీమిలి తీసుకుపోయి కలసి ఉంటే ఎంత సుఖమో తన ఫ్యామిలీని చూపించి మరీ ఎగ్జిబిట్ చేస్తూ... ఎంత చెప్పినా వినకపోయేసరికి ఓ ఆదివారం పొద్దున కైలాసగిరి ఎక్కించి స్యూసైడ్ పాయింట్ దగ్గరికి తీసుకెళ్ళి సంభాషణ మొదలు పెట్టాడు.

***

''మేం ఇద్దరం ప్రేమించుకున్నాం'' – తన గోడు మొదలెట్టాడు హేమ.

''హ హ్హ హ్హ'' బిగ్గరగా నవ్వాడు ఆనంద్.

''సారీ... ఇందులో నవ్వడానికేముంది?''

''ఇద్దరం.. ప్రేమించుకున్నాం అంటేనూ?''

''అవును, ఇందులో వింతేముంది?''

''నీ సంగతి సరే, నీ స్వవిషయం కాబట్టి, నీకు స్పష్టంగానే తెలుస్తుంది... కానీ ఆమె ప్రేమించిందని ఎలా చెప్పగలవ్?''

''ఆమాత్రం తెలుసుకోలేని పిచ్చివాడినా?''

''ప్రేమ పిచ్చిదని, గుడ్డిదని, కుంటిదని కూడా అంటారనుకుంటా''.

''కుంటిదనరు... నాకోసం పడిచచ్చేది, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చేది.''

''దాన్ని నమ్మకం అంటారు.''

''ఎంత నమ్మకం అయితే మాత్రం పార్కులకి, సినిమాలకి, రెస్టారెంట్లకి వచ్చేస్తారా ఇంట్లో చెప్పకుండా, తెలియకుండా?''

''ఇంట్లో వాళ్ళకి తీరికలేదేమో? అమ్మాయి మీద నమ్మకం, భరోసా ఉండి ఉంటాయి. అందుకే తగినంత స్వేచ్ఛ ఇచ్చి ఉంటారు.''

''ఇంతకీ మీరనేదేమిటి?''

''మీరన్నదాన్ని విశ్లేషిస్తున్నాం అంతే, నేనెవర్ని ఏమైనా అంటానికి?''

''నాకోసం ఎదురుచూసేది గంటలు గంటలు.''

''చిన్నపిల్లలు కూడా అలాగే ఎదురు చూస్తారు, నచ్చినవాళ్ళకోసం ఏమైనా ఆటవస్తువు గానీ, తింటానికి గానీ తెస్తారేమోనని...''

''అదే నా గురించి ఎందుకు? వేరే ఎవరితోనైనా వెళ్ళొచ్చుగా?''

''చెప్పాగా నమ్మకం... ఎప్పుడైనా గమనించావా చిన్నపిల్లల్ని? ఓసారి వచ్చి చూసుకుంటుంటారు ఇంట్లో అమ్మ ఉందా లేదా అని. ఉందని భరోసా కుదరగానే ఆటల్లో పడిపోతారు. వాళ్ళకు తల్లిదండ్రులు ఎదురుగా ఉంటే సెక్యూరిటీ ఫీలింగ్. అలాగే యువతికి కూడా ప్రేమించే వాడంటే నమ్మకం, హాని చెయ్యడని, కాపాడతాడని, చిన్నపిల్లల్లా హాయిగా ఉండొచ్చని.''

''అది సరె, వేరే ఎవరైనా అమ్మాయికేసి చూస్తే మోచేత్తో పొడుస్తుందెందుకు?''

''అది జెలసీ. బుడుగు గాడ్ని కింద ఉంచి వేరెవరైనా పాపనో బాబునో ఎత్తుకొని ముద్దు చేశాననుకో ఏకంగా కత్తితో పొడుస్తాడు.''

''ఆడవాళ్ళను చిన్నపిల్లలతో పోలుస్తున్నారే?''

''ఎంత ఎదిగినా, మనస్సుకి, ఎప్పటికీ చిన్నపిల్లలే కాబట్టి. పువ్వులతో పోలుస్తారు ఆడవాళ్ళని, వినలేదా? 'ఎ డాటర్ ఈజ్ లైక్ ఎ ఫ్లవర్ ట్రీట్ హర్ డెలికేట్లీ. అండ్ ఎ సన్ ఈజ్ లైక్ ఎ స్టోన్, ఛిజిల్ హిమ్ టు పెర్‌ఫెక్షన్' అని, ఇంతకీ నిన్ను సరిగ్గా ఛిజిల్ చేసినట్లు లేదు మీవాళ్ళు!''

''చాలా ఇరిటేటింగా ఉంది, మీతో వాదనలో ఓడిపోవడం..'' బిక్కమొహంతో కుళ్ళు నవ్వు నవ్వాడు హేమచంద్ర.

''దాన్ని ఎక్స్‌ప్రెస్ చేసిన తీరు బాగుంది... హహ్హహ్హ... కీప్ ఇట్ అప్'' భుజం తట్టాడు ఆనంద్.

''ఇంతకీ ఏంటంటారు మీరు? ఆమె నన్ను లవ్ చెయ్యలేదంటారు అంతేగా? మరి రాకేష్, మహేష్, సురేష్... ఇంకా చాలామంది సిన్సియర్‌గా ట్రైచేశారు తనని. వాళ్ళెవరికేసి కన్నెత్తయినా చూడంది నాతోనే ఎందుకు తిరిగింది, పెళ్ళెందుకాడింది నన్నే?''

''నువ్వామెను పసిపాపలా చూసుకొని ఉంటావ్, అందరికంటే ఎక్కువగా ప్రేమించి ఉంటావ్. ఆమే లోకంగా తిరిగుంటావ్.''

''హమ్మయ్య ఇప్పటికైనా ఒప్పుకున్నారు మేం ప్రేమించుకున్నాం అని''.

''కమాన్, నువ్వేగా చెప్పావ్ ప్రేమించానని, అదే అన్నాను. ఆమె ప్రేమించిందని ఇంకా అనలేదు''.

''అదిగో మళ్ళీ మొదటికే వచ్చేశాం. ఇంతకీ మీరనేదేమిటి?''

''యువతులు యువకుల్ని ప్రేమించరు బ్రదర్, ఆడుకుంటారు... వాళ్ళ ప్రేమనందుకునేది బిడ్డలు మాత్రమే. అమ్మ అనే పదం అందుకే అంత తీయనైనది. ప్రియురాలు అనే పదానికి అర్థం లేదు. ఉంటే లోకంలో ఇంతమంది దేవదాసులుండరు.''

"దారుణమైన స్టేట్‌మెంట్. పూర్తిగా కొత్త విషయం. ఒక్కమాటలో చెప్పండి – ఆమె నాతోనే ఎందుకు తిరిగినట్లు?"

"బహుశా నువ్వంటే ఇష్టం అయుండొచ్చు."

"అదే ఎందుకని?"

"నీ అందం, ఒడ్డూ, పొడవూ నచ్చుండొచ్చు. చిన్న పిల్లలంతే, ఎవ్వరు హీరో అయితే వాళ్ళే నచ్చుతారు. హీరోలందరూ అందంగా ఉంటారు. అందం చూసే కళ్ళనిబట్టి ఉంటుందనుకో... బట్ యు ఆర్ రియలీ హ్యాండ్‌సమ్.."

"నచ్చితేనే పడిపోతారా?"

"ఆకర్షణ మొదలవుతుందంతే, ఆపైన నీ ప్రవర్తన ఇష్టాన్ని, స్నేహంగా మార్చుండొచ్చు."

"ఇష్టం, స్నేహం, ఇవన్నీ ప్రేమ కాదా?"

"ఐతే ఇన్ని పదాలెందుకు?"

"మీ లాజిక్‌తో చంపుతున్నారు. ఈ హింస నుండి విముక్తి లేదా గురువుగారు?" ప్రాధేయపడ్డాడు హేమ.

"సరే, వెనక్కి వెళదాం. ఆడవాళ్ళని చిన్నపిల్లల లాంటివాళ్ళనీ, పువ్వులని ఎందుకన్నారు?"

"ఏమో? అదీ, మీరే చెప్పండి?"

"వాళ్ళకి ప్రేమ కావాలి... వాళ్ళని సున్నితంగా హ్యాండిల్ చెయ్యాలి. కంటికి రెప్పలా కాపాడాలి. వాళ్ళ గురించే ఆలోచించాలి. వేరెవరి గురించీ ఒక్క మాట కూడా మాట్లాడకూడదు. వాళ్ళ చర్యలన్నింటినీ పొగుడుతుండాలి, మెచ్చుకోవాలేగానీ కఠిన విమర్శ ఎప్పుడు కూడదు. ఏం చెప్పినా సహనంగా, చక్కగా విడమర్చి, లాలనగా కన్విన్స్ చెయ్యాలి.... అప్పుడు ఉంటారు, నవ్వుతూ, ఆహ్లాదకరంగా, తియ్యతియ్యని ముద్దులిస్తూ, అందరినీ సంతోషపరుస్తూ."

"మీరు చిన్నపిల్లల గురించి చెప్తున్నారా? ఆడవాళ్ళ గురించా?"

"ఇద్దరూ ఒకటేనని చెప్పాగా?"

***

"కాసేపు మన విషయం మాట్లాడుకుందాం, నిజాలు, నిజాయితీగా" అన్నాడు సాలోచనగా హేమచంద్ర.

"చాలా ధైర్యం ఉందీ! అందుకే నిన్నిష్టపడుతుంది తను. ఆడవాళ్ళకు అబద్ధాలు చెప్పేవాళ్ళంటే అసహ్యం."

"అంత మంచోడ్ని కాదులెండి. విషయం ఏంటంటే పెళ్ళయేంతవరకూ 'హచ్' కుక్కల వాళ్ళ చుట్టూ తిరిగే మనకి, సంవత్సరం గడవగానే ఎందుకంత ఇంటరెస్ట్ ఉండదు? ఇది కూడా ఒకవిధంగా వాడుకోవడమే కదా?"

"ఇది ఆడవాళ్ళడిగే క్వొశ్చన్, నీవడగడం వింతగా ఉంది? ఓసారి ఆలోచించు నీకే అర్థమవుతుంది. అదీ వాళ్ళ చెప్పుల్లో కాళ్ళుపెట్టి..."

"కాకేగా మిమ్మల్ని అడిగింది. గురువర్యా!"

"నీ ప్రశ్నలో మొదటి భాగానికొద్దాం. వాళ్ళ గురించి తపన, కుక్కలా తిరగడం... రాకేష్, మహేష్ ఇంకా ఎంతోమంది 'ష్' గాళ్ళ నుండి ఆమెను గెల్వాలనే కాంపిటీటివ్ స్పిరిట్ ఒక కారణమ్మై ఉండొచ్చు. మగవాళ్ళకి తొందరెక్కువ. ఆశ ఎక్కువ. కంటికి నచ్చిందల్లా పొందాలనే తపన. కామం అంటారు దాన్ని. అది తీరేంతవరకూ ఆరాటం. ఇది సహజం. ఆకర్షించేది ఆడది, బడేది మొగవాడు. ఎంతమంది ఆకర్షించినా అందుబాటులో ఉన్నదాన్ని కోరుకోవడం వివేకం..."

"మీరన్నది కాదనలేను. మరి ఆకర్షణ పోవడం గురించి?"

"అలవాటు, ప్రతిదీ అలవాటైపోతుంది. పొందేంతవరకూ ఉండే తాపత్రయం, అనుభవించిన తర్వాత ఉండదు. కొత్తకొత్త అనుభవాలు, కోరికలు కావాలి జీవితం గడవడానికి. నీ పెళ్ళాం అయిన తర్వాత ఇంక ఏ 'ష్'గాడు దానివంక చూడడు. నీ పెళ్ళాం నీ ఆస్తి, నీ సొంతం. కాబట్టి త్వరగా అలవాటైపోతుంది. ఆకర్షణ తగ్గిపోతుంది. అయితే ఇవన్నీ ప్రేమ కాదు, ఇందాక ప్రేమించానన్నావ్?"

"లేదు ప్రేమో, ఇంకా ఆమెను గురించే ఆలోచిస్తున్నాను. ఆమె కష్టం సుఖం నాదనుకుంటున్నాను మనస్సు లోతుల్లో... సరె అది కాసేపు పక్కనపెట్టండి. ఇందాకేదో అన్నారు, ఎవ్వరూ తన జోలికి రారని ఒకవేళ వస్తే?"

"ఇలా ఉండవు నువ్వు... హింస... ప్రాణాలు లేచిపోతాయి. అయినా ఇండియాలో అలాంటి అసందర్భ ప్రేలాపనలు తగవ్."

"లేదు, పెళ్ళయిన తర్వాత అందరితో చనువుగా ఉంటుంది. ఆ అవకాశం లేదంటారా. ఆమె ఆకర్షణలో ఎవరైనా పడి గతితప్పితే?"

"అటువంటిదేం జరగదు. ఇది ఇండియా, ఆడవాళ్ళు మొగుడికే కట్టుబడి ఉంటారు. వాడెంత రాక్షసుడైనా సరే! సహనానికి మారుపేరు మన ఆడపిల్లలు, తల్లులు... నీది వట్టి అనుమానం, జెలసీ అయుండాలి.."

"జెలసీకి ఒక కారణం ఉంటుందిగా, ఏ భయం లేకుండా అటువంటి ఉద్వేగం ఎందుకు కలుగుతుంది?"

"నా ప్రియురాలు, నా పెళ్ళాం నాకే కట్టుబడి ఉండాలి అనే స్వార్థం. వాళ్ళు ఇంకెవరితో మాట్లాడినా, కన్నెత్తి చూసినా ఇగో దెబ్బతింటుంది. మగవాడి పొసెసివ్‌నెస్ మహాదురుసు, హింసాత్మకం. బహుశా అందుకే త్వరగా వదిలించుకునే గుణం కూడా ఇచ్చారు దేవుడు మగవాడికి. అయితే ఆమెది స్నేహభావం అని మాత్రం స్పష్టంగా చెప్పగలను. స్నేహం పవిత్రమైన ప్రేమని కోరుకుంటుంది. అంతకుమించి ఒక్కస్టెప్ ముందుకు పడితే స్నేహం కట్ అయిపోతుంది. ఇక నీ విషయం – ఆమె నీ భార్య. నీకు నచ్చని విషయాలుంటే ఆమెతో నిరభ్యంతరంగా సంభాషించొచ్చు."

"అర్థమయింది, ప్రయత్నిస్తాను".

***

"మరి వాళ్ళ సంగతేంటి? అలవాటు విషయంలో?"


"వాళ్ళకూ సేమ్ టు సేమ్. పిల్లలు పుడితే నీకు తెలుస్తుంది... కాకపోతే పసిపిల్లల్లాంటి వాళ్ళనుకున్నాంగా 'అలవాటు' వేరే విధంగా ఉంటుంది. పొసెసివ్‌నెస్‌గా పరిణమిస్తుంది. పట్టి బంధించి ఉంచాలనుకుంటారు, మనలా దురుసుగా కాకుండా, ఏడుస్తూ ప్రాధేయపడ్తూ... ఘర్షణ అంటూ ఉంటే అక్కడే మొదలవుతుంది."

"అర్థం కాలేదు".

"స్వేచ్ఛ మగవాడి లక్షణం, బంధాలు తెంచుకుని పారిపోవడానికి చూస్తుంటాడు. జీవం పుట్టుక అవలోకించు. మగవాడు వదులుతాడు, స్త్రీ దాన్ని తనలోకి తీసుకుని పెంచి పెద్దచేసి బిడ్డగా ఇస్తుంది. వాళ్ళు కలిగి ఉంటారు.. అదే కన్‌సీవింగ్, పొసెసివ్‌నెస్. మనకి పని అయిపోతుంది. ఫ్రీడమ్. అప్పటికి సుఖం కావాలనే కోరిక నుండి, ఆరాటం నుండి... అర్థమయిందా?"

"మనది మనకి అర్థమవుతూనే ఉంటుంది, వాళ్ళ గురించి చెప్పండి."

"అబలని చేసి ప్రతిగా వాళ్ళకి అబ్‌జార్బ్ (కష్టాల్ని సహించి హరించే) చేసుకునే గుణం ఇచ్చాడు దేవుడు. మనంత తొందరగా దేన్నీ వదులుకోరు, పరిగెట్టరు, భరిస్తారు. అందుకే భార్య అన్నారు. ఆ పదానికి చాలా అర్థం ఉంది. కాకపోతే ప్రేమకోసం ఆధారపడుతుంటారు. పెళ్ళయేంతవరకూ తండ్రి మీద, పుట్టింటి మీద, స్నేహంపైన అదిచ్చే స్వచ్ఛమైన ప్రేమపైన, (అన్నీ చేస్తాం స్నేహితుని కోసం ఏమీ తిరిగి అడగకుండానే, వాళ్ళ కష్టాలు తీరి ఆనందంగా ఉంటే మనకీ ఆనందం. అదే స్వచ్ఛమైన ప్రేమ)



తర్వాత భర్తపైన. ఆపై పిల్లల మీద అనురాగం ఆశలు... పెళ్ళయితే పుట్టిల్లు దూరం... భర్తకోసం కుటుంబం కోసం స్నేహితులు దూరం... ఎటు పోయి ఎటొచ్చినా భర్త మాత్రమే శాశ్వతం. పిల్లలూ శాశ్వతం కాదు. ఎందుకంటే వాళ్ళ పెళ్ళిళ్ళయితే వాళ్ళూ దూరం అవుతారు కాబట్టి... అర్థమయిందా భార్య అనే పదానికున్న అర్థం?''

........

''ఆలోచించు.. వాళ్ళకి రక్షణ కావాలి, ప్రేమ కావాలి. మనకు సెక్స్ కావాలి, సుఖం కావాలి. మనం ప్రేమనిస్తాం, వాళ్ళు మనకి సుఖాన్నిస్తారు. చక్కగా వండిపెడ్తారు. నీకు నచ్చినట్లు ఇంటిని ఉంచుతారు. అలంకరిస్తారు. సింగారించుకుంటారు. చక్కని పిల్లల్ని కంటారు. బాధ్యతగా పెంచుతారు. నీ కష్టాన్ని జాగ్రత్త చేస్తారు. పొదుపు చేస్తారు. సమాజంలో నీ పేరు నిలబెడ్తారు. ఇంత చాకిరీ ఎందుకు చేస్తారు? ప్రేమకోసం... నిజాయితీకోసం..''

''నిజమే...'' హేమచంద్రలో మార్పు కనిపించింది.

''కాబట్టి మనం మన దూకుడికి కళ్లె వేసి, కుటుంబాన్ని ప్రేమించాలి. కమ్మని సంగీతం విన్నట్లు, చక్కని పూల సుగంధం ఆస్వాదించినట్లు, సున్నితంగా వాళ్ల తోడు కోరుకోవాలి. అప్పుడే సంసారం స్వర్గం అవుతుంది. సమాజం సవ్యంగా వుంటుంది. అదే ధర్మం....నువ్వు ఇవ్వగల్గినంతా ఇవ్వు తీసుకోవలసినంతే తీసుకో.... ఎక్కువ తక్కువలొద్దు....ప్రయత్నించి చూడు... అతి ప్రేమ అనర్థం, ప్రేమరాహిత్యం కూడా అంతే. చక్కగా బ్యాలెన్స్ చెయ్యి. సుఖాన్ని అనుభవించు. చివరిగా ఒక మాట... మనం ప్రేమిస్తే అది ప్రేమ. ఎదుటి వాళ్లు మనని ప్రేమించాలనుకోవడం స్వార్థం...పదాలను సరిగా అర్థం చేసుకో...సరియైన ప్రశ్నలే అడుగుతుండు. లాజిక్ అప్పుడు వివేకమవుతుంది. హింస అవ్వదు.''

***

మెట్ల దగ్గర ఏదో అలికిడైంది. గద్దలు ఒకసారి ఆకాశంలో ఎగిరి తిరిగి చెట్ల మీద వ్రాలాయి. ఓ ప్రేమికుల జంట మెట్లెక్కి వచ్చారు. ఆనంద్ మనంగా కూర్చున్నాడు. హేమచంద్ర ఆలోచనల్లో మునిగిపొయ్యాడు. మనో మథనం, గ్రహణం పట్టిన అతని ముఖంలో ప్రతిబింబిస్తుంది. ఆనంద్ లేచి ఫెన్సింగ్ దగ్గరకెళ్లి చుట్టూ చూశాడు. లోయంతా పచ్చని అడవి... స్యూసైడ్ పాయింట్! కిందకి దూకేస్తే? క్షణం వళ్లు జలదరించింది. ఆకాశం నిర్మలంగా వుంది. సమయం ఎనిమిదవుతుంది. సూర్యుడు వడివడిగా సంద్రం నుండి నింగికెగబాకాడు. పచ్చదనం సూర్యకిరణాల్ని ఆబగా జుర్రుకుంటుంది. చల్లగాలికి హాయిగా తలలూపుతున్నాయి. చెట్లు, సుగంధాలు విరజిమ్ముతున్నాయి పూలు... హేమచంద్ర మొహం గ్రహణం వీడింది. ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా తలెత్తాడు. మంచు వీడిన ప్రపంచం సూర్యతేజస్సుతో కళకళలాడుతుంది.

''ఏదో నిర్ణయానికి వచ్చినట్లున్నావ్. తమలపాకులా, విడాకులా?'' నవ్వుతూ అడిగాడు ఆనంద్.

''ఇంక జీవితం మామిడాకుల తోరణాలే!'' వచ్చి చిన్నపిల్లాడిలా కౌగిలించుకున్నాడు హేమ.

'శభాష్' వీపుతట్టాడు ఆనంద్ ఆప్యాయంగా.

''గురువుగారూ, జ్ఞానం ప్రసాదించినందుకు థ్యాంక్స్. ఇక నేవెళతాను, కానీ....''

''పరిగెట్టు, ఇంకా కానీ అర్ధణా ఏంటి స్వామీ''

''మీరు కూడా వస్తే బాగుంటుంది. శ్రావణి గురించి నాకు భయంలేదు. కానీ మా అత్తగారి రియాక్షన్ ఎలా వుంటుందో?''

''ఏమీ అనకుండా ఎందుకుంటారు ఎవరైనా? నువ్వు చేసింది మామూలు పనా? సంవత్సరం దూరంగా వున్నావు. కన్పుకని పంపి, పట్టుదల గుర్రమెక్కి కూర్చున్నావ్. కనీసం పసిపాపని చూడడానికి కూడా కరగలేదు నీ పంతం?''

''ఇల్లరికం రమ్మంటున్నారు సార్. సంఘంలో తలెత్తుకోగలరా మా అమ్మానాన్న?''

''మీరెంత మంది పిల్లలు మీ అమ్మానాన్నలకి''

''ముగ్గురం. నేను, తమ్ముడు, అక్క''

''మరి మీ అత్తగార్కి''

''శ్రావణి ఒక్కతే కూతురు''

''మీ మామగారు కూడా లేరు కదా. ఉన్న ఒక్క కూతుర్ని వదిలి ఎలా వుండగలదు ముసలితనంలో ఆమె? ఎప్పుడైనా ఆలోచించావా?''

''మరి సంఘం?''

''ఏంటయ్యా సంఘం? ఎవరి కుందయ్యా తీరిక? పక్కవాడి గురించి ఆలోచించడానికి? ఎవరో సంగతెందుకు? నీ సంగతి చెప్పు. పొద్దున లేచిందగ్గర్నుంచి నిద్రపోయేంతవరకు ఎవరి గురించి ఆలోచిస్తావు... నీ గురించేగా... అందరూ అంతేనయ్యా''

''శ్రావణి గురించి, పాప గురించి ఆలోచిస్తాను సార్...ప్రేమలో పడ్డప్పటి నుంచి ఆమె గురించే ప్రతిక్షణం తపన'' హేమచంద్ర కళ్లు తుడుచుకున్నాడు.

''అదేనయ్యా ప్రేమంటే... ఆ ఒక్క ఎమోషన్ మాత్రమే మనిషిని పక్కవాళ్ల గురించి ఆలోచింపజేస్తుంది. అదేనయ్యా ప్రేమ గొప్పతనం. అది లేకపోతే లోకం అంతా స్వార్థమయం, హింస, ప్రతిహింసలతో దద్దరిల్లిపోతుంది. ప్రేమ ప్రవాహానికి అడ్డుకట్ట వేయకు. మునిగిపోతావ్. వెళ్లు హాయిగా ప్రవహించు....''

''మీరు కూడా వస్తే బాగుంటుంది సార్'' బ్రతిమాలాడు హేమ.

''నేను దుప్పటి లాంటి వాడిని హేమచంద్రా! దుప్పటి నీలో వేడి వుంటేనే వెచ్చగా వుంచుతుంది. నీలో చల్లదనం వుంటే ఇంకా చల్లగా అయిపోతావ్. స్వతహాగా దుప్పట్లో వేడిమి గాని, చల్లదనం గాని వుండదు. నేను అంతే. నీలో ప్రేమ వుంది. దాన్ని జ్వలింపచేసాను. కాపాడాను. అది లేకపోతే నేనేం చెయ్యలేను. వాళ్లు నీ ప్రేమ కోసం తపిస్తున్నారు. వాళ్ల పరిస్థితి దుర్భరంగా వుందిప్పుడు. నీ ప్రేమ రాహిత్యం వల్ల అటువంటి జీవితం అనుభవించే వాళ్లకి కోపం రావడం సహజం.''

''చివరిగా ఒక్కమాట. ఒకే దుప్పటి కింద పడుకున్న వాళ్లెవరైనా సరే తెల్లారేసరికి కౌగిలిలో వుండాల్సిందే. విడి విడిగా వుండడం కుదరదు. ఇంకెప్పుడూ విడాకులంటూ రాకు నా దగ్గరకి. దుప్పటిని వెచ్చగా హాయిగా వుంచడానికి ఉపయోగించుకోవాలి కాని, ఉక్కిరిబిక్కిరయి ప్రాణం తీసుకోవడానికి కాదు. అర్థమయిందా?''

''అదే నేను భయపడేది సార్''

''అటువంటి పరిస్థితులలో అడ్డుతెరనవుతాను చంద్రా! నీ ఉద్వేగాన్ని అడ్డుకోకూడదు. దెయ్యం బయటకి వెళ్లడమే మంచిదందరికి అనుభవించు ఎవరి కర్మకు వాళ్లే బాధ్యులు...'' బిక్కమొహం పెట్టిన హేమచంద్ర భుజం తడ్తూ ఉపాయం చెప్పాడు ఆనంద్....

''భయపడకు. సహనం అన్నింటిని జయిస్తుంది. మౌనం సహనాన్నిస్తుంది. అప్పుడు అన్ని విషయాలు చక్కగా అర్థమవుతాయి. సహనం సాక్షిగా మౌనం నీలోని 'నిన్ను' హరించి, ప్రపంచానికి చోటునిస్తుంది. భూమ్మీద 'జీవిస్తున్నాం' అనే నిజమైన ఫీలింగ్ ఇప్పుడు కలుగుతుంది. ఒక్కరోజు వాళ్ల సమక్షంలో మౌనంగా వుండు. వాళ్ల కోపాన్ని అనుభవించు. వాళ్ల దుఃఖాన్ని అర్థం చేసుకో. నీ కోసం వాళ్లు పడే తపన నీ ప్రేమ కోసం వాళ్లు పడే ఆరాటం ఎరుకవుతుంది. నీ ప్రేమని పంచు. జీవితాన్ని సుఖమయం చేసుకో.''

***

''అయితే సరే సార్ వెళతాను''

''చివరిగా ఒక్కమాట. ఒకే దుప్పటి కింద పడుకున్న వాళ్లెవరైనా సరే తెల్లారేసరికి కౌగిలిలో వుండాల్సిందే. విడి విడిగా వుండడం కుదరదు. ఇంకెప్పుడూ విడాకులంటూ రాకు నా దగ్గరకి. దుప్పటిని వెచ్చగా హాయిగా వుంచడానికి ఉపయోగించుకోవాలి కాని, ఉక్కిరిబిక్కిరయి ప్రాణం తీసుకోవడానికి కాదు. అర్థమయిందా?'' నవ్వుతూ భుజం తట్టాడు ఆనంద్.

***

''మేం ఇద్దరం చాలా గాఢంగా ప్రేమించుకున్నాం సార్'' అంది పల్లవి.

''హ హ్హ హ్హ'' నవ్వాడు ఆనంద్.

''అంతేలెండి. ప్రేమ పెళ్లి చేసుకొని విడాకుల కొస్తే ఎవరికైనా అలానే వుంటుంది. మాదే తప్పు'' నిష్ఠూరమాడుతూ కళ్ల నీళ్లు పెట్టుకుందా అమ్మాయి.

''మగవాళ్లు ప్రేమించరమ్మాయ్... ముందా కన్నీళ్లు తుడుచుకో. ధైర్యంగా వుండు''

''అదేంటి సార్. ప్రేమించినవాళ్లు 'హచ్' కుక్కలా నా వెంటే తిరిగితే మీరలా అంటారు... కైలాసగిరి మీద నుంచి దూకేస్తామన్నారు తెలుసా''

''దాన్ని ప్రేమ అనరమ్మా''

తర్కం కొనసాగుతుంది. మేథో మథనం జరుగుతుంది. అవును ఎర్రగా కాలిస్తేనే గాని ఇనుము వంగదు. సానబెడితేనే గాని వజ్రానికి వెలుగురాదు. ఆలోచనలని తరిమితే గాని ఉద్వేగాలు బయటపడవ్... అన్నింటినీ హరిస్తేనే గాని మౌనం సంభవించదు.

తర్కంతో బుర్రలు హీటెక్కుతూనే వుంటాయి. దారి తప్పిన మనుషులు ఇళ్లకి చేరుకుంటారు. అనుబంధాలు కొనసాగుతూనే వుంటాయ్.

★